సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా
సోమవారం ၊ 28 ၊ ఏప్రిల్ ၊ 2025



హరిహరుల క్షేత్రం.. పుష్పగిరి

హరిహరులు కొలువైన పుష్పగిరి క్షేత్రం బ్రహ్మోత్సవ శోభ సంతరించుకుంది. ఈ నెల 26న ప్రారంభమైన ఉత్సవాలు మే 4 వరకు జరగనున్నాయి. -8లో



దూసుకొచ్చిన మృత్యువు

చింతకొమ్మదిన్నె మండలంలోని గువ్వల చెరువు ఘాట్‌లో బైక్‌ను బొలెరో పికప్ వాహనం ఢీకొనడంతో.. ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
42.4/28.4

వాతావరణం

జిల్లాలో ఆదివారం 28.4 - 42.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

29న సర్టిఫికెట్లు తీసుకెళ్లాలి

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్‌ఆర్ జిల్లాలో ఉపాధ్యాయులకు మెడికల్ సర్టిఫికెట్ కోసం ఇటీవల రిమ్స్‌లో మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. ఈ నెల 29న మధ్యాహ్నం 3 గంటలకు కడప డీఈఓ కార్యాలయానికి వారు వచ్చి సర్టిఫికెట్లను తీసుకెళ్లాలని ఆయన పేర్కొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లుగా అవకాశం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపోలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై డ్రైవర్లుగా పని చేసేందుకు ఆసక్తి గల వారు తమ కార్యాలయంలో సంప్రదించాలని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. అభ్యర్థులు హెవీ డ్రైవింగ్ లైసెన్స్, డ్రైవింగ్‌లో ఒకటిన్నర సంవత్సరం అనుభవం తప్పనిసరి అని ఆయన పేర్కొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కడప సెవెన్‌రోడ్స్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కేంద్రంతోపాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారు.

డయల్ యువర్ కలెక్టర్: డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు డీఆర్వో తెలిపారు. ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

11న దూదేకుల విద్యార్థులకు పురస్కారం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో అత్యధిక మార్కులు సాధించిన దూదేకుల విద్యార్థులకు మే 11న నగరంలోని ఎర్రముక్కపల్లె దూదేకుల జిల్లా భవన్‌లో ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు ఏపీ నూర్ బాషా దూదేకుల, బీసీ, ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న రాజా పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని దూదేకుల సంక్షేమ భవన్‌లో ఆయన మాట్లాడారు. తమ సంఘంతో పాటు కడప నూర్ భాష దూదేకుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్‌లో 950, పదో తరగతిలో 560కు పైగా మార్కులు సాధించిన వారు మే 9 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9440677839, 9441276127, 7780441172, 9951667362 అనే ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సుంకేసుల బాషా, నాయకులు ఖాదరయ్య, ఓబులేసు, కమాల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ముంచుకొస్తున్న గడువు

- ఇక 40 రోజులకు డీఎస్సీ పరీక్ష
- దరఖాస్తు చేసుకునేందుకు సరిగా పని చేయని ఆన్‌లైన్
- ప్రిపరేషన్‌కు సమయం లేక సతమతం
- ఆందోళనలో అభ్యర్థులు



డీఎస్సీ కోసం కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులు

కడప ఎడ్యుకేషన్: డీఎస్సీ ప్రిపరేషన్‌కు గడువు ముంచుకొస్తోంది. పరీక్ష రాసేందుకు 40 రోజులు మాత్రమే కాలపరిమితి ఉంది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు ఒక పక్క పరీక్షకు సన్నద్ధం అవుతూ.. మరో వైపు డీఎస్సీ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఆన్‌లైన్ సరిగా పని చేయక పోవడంతో.. దరఖాస్తు చేసుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులో అభ్యర్థులకు సంబంధించిన అన్ని పత్రాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఇందుకోసం అన్ని పత్రాలు సిద్ధం చేసుకోవాలి. ముఖ్యంగా స్టడీ సర్టిఫికెట్ అవసరం. కానీ కొంత మంది అభ్యర్థులు తమ స్టడీ సర్టిఫికెట్ కోసం.. తాము 1 నుంచి 10వ తరగతి వరకు చదువుకున్న పాఠశాలలను వెతుక్కుంటూ ఊర్లబాట పడుతున్నారు. తీరా అక్కడి వెళ్దామంటే పాఠశాలలకు వెసవి సెలవులు ప్రకటించారు. దీంతో అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది. దరఖాస్తుతో పాటు అన్ని పత్రాలు అప్‌లోడ్ చేస్తేనే అప్లికేషన్ పూర్తి అయినట్టు వస్తుంది. దరఖాస్తులో ఏ ఒక్క కాలం పూర్తి చేయకపోయినా.. తీసుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఏదైనా పొరపాటు చేస్తే మళ్లీ ఎడిట్ ఆప్షన్ వస్తుందో రాదోననే ఆందోళన అభ్యర్థులను వేధిస్తోంది. దీంతో చాలా మంది నిరుద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ప్రిపరేషన్‌కు గడువు తక్కువే..

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసినందుకు అభ్యర్థుల్లో ఆనందం వ్యక్తం అయినా.. అంతలోనే ఆవిరైపోయే పరిస్థితి నెలకొంది. పరీక్ష సన్నద్ధతకు 40 రోజులు మాత్రమే గడువు ఇవ్వడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీఎస్సీ పరీక్షకు సంబంధించి సిలబస్ పరంగా 6 నుంచి 10వ తరగతికి చెందిన 30 సబ్జెక్టులు ఉంటాయి. ఇంత తక్కువ కాలంలో అన్ని సబ్జెక్టులను ఏ విధంగా చదవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో సబ్జెక్టుకు కనీసం రెండు, మూడు రోజులైనా గడువుంటే బాగుటుందని.. అలాంటిది ఒక్కో సబ్జెక్టుకు ఒకటిన్నర రోజు మాత్రమే గడువు ఉందని వాపోతున్నారు. ఉన్న ఈ తక్కువ కాలంలో దరఖాస్తు ఎలా ఫిల్ చేసుకోవాలో.. పరీక్షకు ఎలా ప్రిపేర్ అవ్వాలో తెలియక అభ్యర్థులు సతమతమవుతున్నారు.

గత ప్రభుత్వంలో...

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డీఎస్సీని ప్రకటించింది. అయితే డీఎస్సీ పరీక్షకు కేవలం 40 రోజులు మాత్రమే గడువు ఉందని.. ఈ తక్కువ కాలంలో అభ్యర్థులు పరీక్షకు ఎలా సంసిద్ధమవుతారని టీడీపీ నాయకులు నానాయాగీ చేశారు. దీంతో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గడువు పెంచేందుకు ప్రయత్నం చేసినా.. ఎన్నికల నోటిఫికేషన్ దగ్గరుండటంతో చేసేదేమీలేక డీఎస్సీని రద్దు చేసింది. అయితే అప్పట్లో రాద్ధాంతం చేసిన టీడీపీ.. ఇప్పుడు 45 రోజులు మాత్రమే గడువు పెట్టి నోటిఫికేషన్ విడుదల చేసింది. మరి ఏ ఉద్దేశంతో ఈ ప్రభుత్వం 45 రోజులు గడువు పెట్టి డీఎస్సీని ప్రకటించిందని పలువురు విద్యావేత్తలు, మేధావులు ప్రశ్నిస్తున్నారు. అభ్యర్థుల కళ్ల నీళ్లు తుడవడం కోసమే ఈ డీఎస్సీని ప్రకటించిందని, వారికి న్యాయం చేసేందుకు కాదనే పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో ఖాళీ పోస్టుల వివరాలు

సబ్జెక్టు	ప్రభుత్వ, జెడ్పీ	మున్సిపల్	కార్పొరేషన్	మొత్తం
ఎస్‌ఏ సంస్కృతం	–	–	1	1
ఎస్‌ఏ తెలుగు	26	–	–	26
ఎస్‌ఏ ఉర్దూ	6	–	1	7
ఎస్‌ఏ హిందీ	16	1	1	18
ఎస్‌ఏ ఇంగ్లీస్	78	1	2	81
ఎస్‌ఏ మ్యాథ్స్(టీఎం)	42	–	1	43
ఎస్‌ఏ మ్యాథ్స్(యూఎం)	–	1	–	1
ఎస్‌ఏ పీఎస్(టీఎం)	28	–	–	28
ఎస్‌ఏ పీఎస్(యూఎం)	2	–	1	3
ఎస్‌ఏ బీఎస్(టీఎం)	49	2	–	51
ఎస్‌ఏ బీఎస్(యూఎం)	2	–	–	2
ఎస్‌ఏ ఎస్‌ఎస్(టీఎం)	58	1	1	60
ఎస్‌ఏ ఎస్‌ఎస్(యూఎం)	5	–	–	1
ఎస్‌ఏ పీఈ	77	1	4	82
ఎస్‌జీటీ (టీఎం)	219	21	12	252
ఎస్‌జీటీ(యూఎం)	31	7	7	45
మొత్తం	639	35	31	705

గడువు పెంచాలి



డీఎస్సీ కోసం ప్రభుత్వం ప్రకటించిన గడువు చాలా తక్కువ ఉంది. ఈ తక్కువ గడువులో పరీక్షకు ప్రిపేర్ కావాలా లేక దరఖాస్తు చేసుకునేందుకు టైమ్‌ను కేటాయించాలో అర్థం కావడం లేదు. మాకు న్యాయం జరగాలంటే కచ్చితంగా గడువును పెంచాలి.
– నయోమి, డీఎస్సీ అభ్యర్థి, బద్వేల్

అంతా హడావిడి



లక్షల మందిని ఎదుర్కొని ఉద్యోగం సాధించాలంటే సిలబస్ పూర్తి స్థాయిలో చదవాల్సి ఉంటుంది. హడావుడిగా చదివి పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోవడం అభ్యర్థులకు కష్టసాధ్యం. కావున ప్రభుత్వం స్పందించి కనీసం మూడు నెలల గడువు ఇవ్వాలి.
– మమత, డీఎస్సీ అభ్యర్థి, కడప

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ముస్లిం, క్రిస్టియన్, బుద్దిస్ట్, సిక్కు, జైను, పార్సీ మైనార్టీల సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి షేక్ హిదాయతుల్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఏపీఓబీఎంఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థి వయసు 21-55 ఏళ్ల మధ్య ఉండాలని, ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతం వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2 లక్షలుగా నిర్ణయించారన్నారు. రూ.లక్ష యూనిట్‌కు సంబంధించి 50 శాతం సబ్సిడీ, రూ.లక్ష నుంచి రూ.3 లక్షల యూనిట్ ఖర్చు వరకు గరిష్ఠంగా రూ.1.25 లక్షలు సబ్సిడీ, రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు యూనిట్ ఖర్చుకు గరిష్ఠంగా రూ.2 లక్షల సబ్సిడీ, రూ.5 నుంచి రూ.8 లక్షల యూనిట్ (డి.ఫార్మా/బి.ఫార్మా విద్యార్థులకు ప్రత్యేక కథనం) 50 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు కలెక్టరేట్ డి-బ్లాక్‌లో గల ఈడీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

14 నుంచి బ్రహ్మోత్సవాలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆలయ ధర్మకర్తలు

రాజంపేట రూరల్: శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను మే 10వ తేది నుంచి 14వ తేది వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య కుమారుడు పసుపులేటి వీరప్రదీప్‌కుమార్ తెలియజేశారు. భువనగిరిపల్లి వద్దనున్న లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆలయ ధర్మకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

ప్రత్యేక బస్సు సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్: విద్యా సంస్థలకు వేసవి సెలవుల నేపథ్యంలో పలు విహార ప్రదేశాలు, పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం మీడియాకు వివ రాలు వెల్లడించారు. కడప డిపో నుంచి గోవా, ఊటీ, వేలాంగిణి, అరుణాచలానికి బస్సులు నడుస్తాయన్నారు.

- మే 9న కడప నుంచి గోవాకు ఇంద్ర (50301) సర్వీసు బయలుదేరుతుందని, ఇందులో రూ.4200 చార్జిగా నిర్ణయించామన్నారు. అదే రోజు బెంగళూరు, మైసూరు మీదుగా ఊటీకి సూపర్ లగ్జరీ సర్వీసు రాత్రి 7 గంటలకు బయలుదేరుతుందన్నారు. ఇందులో చార్జిగా రూ.2400గా ఉంటుందన్నారు. మే 9వ తేదీనే వేలాంగిణికి వయా నాగపట్నం మీదుగా ఇంద్ర (950066) బస్సు సర్వీసు బయలుదేరి వెళుతుందన్నారు. ఇందులో చార్జిగా రూ.3200 ఉందన్నారు.
- పౌర్ణమి సందర్భంగా మే 11న కడప డిపో నుంచి అరుణాచలానికి రెండు ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. రాత్రి 9 గంటలకు సూపర్ లగ్జరీ (6001) బయలుదేరి వెళుతుందన్నారు. ఇందులో రూ.1050 చార్జిగా ఉందన్నారు. ఈ బస్సు చిత్తూరు, వేలూరు మీదుగా వెళ్తుందన్నారు. అదే రోజు ఉదయం 6 గంటలకు అరుణాచలానికి మరో బస్సు వెళుతుందన్నారు. ఈ సూపర్ లగ్జరీ సర్వీసు (913337)లో చార్జిగా రూ. 1350 నిర్ణయించామన్నారు. ఈ బస్సు గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా అరుణాచలం వెళ్తుందన్నారు. ఈ బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని, ఆన్‌లైన్ లేదా ఆర్టీసీ బస్టాండులోని రిజర్వేషన్ కౌంటర్‌లో తమ టిక్కెట్లను ముందుగానే రిజర్వేషన్ చేసుకోవాలన్నారు.

వీరభద్రస్వామికి పల్లకీ సేవ



పల్లకీపై స్వామి, అమ్మవారి ఊరేగింపు

రాయచోటి టౌన్: రాయచోటిలో శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి పల్లకీ సేవ నిర్వహించారు. ఆదివారం అమావాస్య కావడంతో రాత్రి మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ మాఢవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక భక్తులతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

ఎర్రమట్టి.. కొల్లగొట్టి..



పెండ్లిమర్రి మండలం ఎగువ చెరువులో టిప్పర్లకు ఎర్రమట్టి నింపుతున్న జేసీబీ


- ఎగువ చెరువును చెరపట్టిన టీడీపీ వర్గీయులు
- రాయల్టీ చెల్లించకుండా మిషన్లు పెట్టి దోపిడీ
- నిత్యం వందలాది టిప్పర్లతో తరలింపు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

సాక్షి ప్రతినిధి, కడప: అధికారమే పెట్టుబడిగా టీడీపీ నేతలు ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. ఇసుక, గ్రావెల్, ఎర్రమట్టి ఎక్కడ ఎలాంటి అవకాశం ఉంటే.. అక్కడ దోపిడీకి తెరలేపుతున్నారు. కోట్లాది రూపాయాలు రాయల్టీ ప్రభుత్వ ఖజానాకు చేరాల్సి ఉండగా, ఒక్క రూపాయి చెల్లించకుండా అక్రమార్జనకు పాల్పడుతున్నారు. జిల్లాలో పట్టపగలు ఇలాంటి వ్యవహారం నిత్యం తెరపైకి వస్తున్నా.. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. అక్రమార్కులు తెలుగు తమ్ముళ్ల అయితే.. ఎలాంటి ఆటంకాలు కల్పించవద్దనే దిశగా జిల్లాలో అధికారుల నడవడిక కన్పిస్తోంది.

యథేచ్ఛగా దందా

ప్రభుత్వ నిర్వాకం వల్ల గ్రావెల్, ఎర్రమట్టి మాఫియా తెరపైకి వచ్చింది. మైనింగ్ లీజుదారులకు పర్మిట్లు ఇవ్వకపోవడంతో అక్రమ మైనింగ్‌కు ఆస్కారమిచ్చారు. జిల్లా కేంద్రంలో ఐదు గ్రావెల్ మైన్లు ఉండగా, ఒక్క మైన్‌కు కూడా రాయల్టీలు ఇవ్వలేదు. వెరసి గ్రావెల్ మాఫియా విచ్చలవిడిగా దోపిడీకి పాల్పడుతోంది. ఆపై ఈ వ్యవహారం కమలాపురం నియోజకవర్గంలో యథేచ్ఛగా కొనసాగుతోంది. చింతకొమ్మదిన్నె, పెండ్లిమర్రి, వల్లూరు, కమలాపురం మండలాల్లో అక్రమ మైనింగ్ ద్వారా కోట్లాది రూపాయాలు కొల్లగొట్టారు.

ఎగువ చెరువు లూటీ



పెండ్లిమర్రి మండలం వెల్లటూరు సమీపంలో ఉన్న ఎగువ చెరువును తెలుగు తమ్ముళ్లు లూటీ చేస్తున్నారు. నిత్యం వందలాది టిప్పర్లతో ఎర్రమట్టి తరలిస్తున్నారు. పులివెందుల, కడప, ప్రొద్దుటూరు ప్రధాన పట్టణాలకు ఎగువ చెరువు నుంచి ఎర్రమట్టి తరలివెళ్తోంది. భారీ యంత్రాలతో లోడింగ్ చేస్తూ, పట్టపగలు దోపిడీకి పాల్పడుతున్నా.. మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఇది వరకూ అదే మండలంలోని గొందిపల్లె నుంచి మట్టి, గ్రావెల్ దోపిడీకి పాల్పడ్డ టీడీపీ వర్గీయులు తాజాగా ఎగువ చెరువులో తిష్టవేశారు. ఎలాంటి రాయల్టీ చెల్లించకుండా గ్రావెల్ తరలించి సొమ్ము చేసుకున్న విధంగానే.. ఎర్రమట్టి ద్వారా నిత్యం లక్షలాది రూపాయాలు ఆర్జిస్తున్నారు.

సాహసించని అధికారులు

జిల్లా కేంద్రమైన కడప చుట్టూ కమలాపురం నియోజకవర్గం విస్తరించి ఉంది. ఆ ప్రాంతంలో ఉన్న కొండలు, గుట్టలు ఆసరాగా.. దాదాపు గడిచిన ఆరు నెలలుగా అక్రమ మైనింగ్ ఏదో ప్రాంతంలో కొనసాగిస్తున్నారు. చింతకొమ్మదిన్నె, పబ్బాపురం చెరువులతో పాటు పిచ్చమ్మ గుట్టలో గ్రావెల్ ఊడ్చిపడేశారు. పెండ్లిమర్రి మండలం గొందిపల్లె గుట్టలను గుల్ల చేశారు. ప్రస్తుతం తెలుగు తమ్ముళ్ల అక్రమ వ్యవహారం ఎగువ చెరువు కేంద్రంగా నడుస్తోంది. ఈ స్థాయిలో కమలాపురం నియోజకవర్గంలో అక్రమ మైనింగ్‌కు.. ప్రజాప్రతినిధి సాన్నిహిత్యం, ఆర్థిక లావాదేవిలే ప్రధాన కారణంగా తెలుస్తోంది. సామాన్యులు లేదా పత్రికా ప్రతినిధులు.. మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా, వివరణ కోరినా వారి నుంచి వస్తున్న ఏకైక సమాధానం.. 'మా నోటీసుకు రాలేదు, పరిశీలిస్తాం' అని చెప్పడం మినహా అటువైపు కన్నెత్తి చూసే సాహసం కూడా చేయడం లేదు. మరోవైపు జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ అక్రమ మైనింగ్ విషయంలో అంటీ ముట్టనట్లుగా ఉండటం కూడా మరో కారణంగా విశ్లేషకులు చెప్పుకొస్తుండటం గమనార్హం.

నకిలీ సర్టిఫికెట్ల కలకలం

వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో చేపడుతున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్స్ నియామకాల్లో.. నకిలీ సర్టిఫికెట్స్ వెలుగు చూడటం కలకలం రేపుతోంది. కొంత మంది అన్ని వ్యవహారాల్లో ఆరితేరి.. అడ్డదారుల్లో అక్రమంగా సంపాదించుకోవడానికి ఒక ముఠాగా ఏర్పడి.. వీటిని తయారు చేస్తున్నట్లు వినికిడి. దీంతో అప్రమత్తమైన ఆ శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టడంతో.. ఈ వ్యవహారం బయటపడింది.

- స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీలో వెలుగులోకి..
- ధ్రువీకరించిన హెల్త్ యూనివర్సిటీ
- కొందరి హస్తలాఘవంతో తయారీ
- వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం అప్రమత్తం



వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం



కడప రూరల్: కడపలోని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4(రాయలసీమ జిల్లాలు) పరిధిలో ఈ ఏడాది జనవరిలో కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్స్ నియామకాలకు చర్యలు చేపట్టారు. మొత్తం 150 పోస్టులకు గాను 11 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వాటిని ఆ కార్యాలయ సిబ్బంది పరిశీలించి జాబితా సిద్ధం చేయడానికి పెద్ద కసరత్తే చేశారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో రెండు విడతలుగా పెద్ద ఎత్తున నియామకాలు జరిగాయి. ఆ పరంపరలోనే తాజాగా నియామకాలకు శ్రీకారం చుట్టారు.

అనుమానంతో...

వచ్చిన దరఖాస్తుల ఆధారంగా నిబంధనల ప్రకారం అభ్యర్థుల ఎంపిక ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. 11 వేలకు పైగా వచ్చిన దరఖాస్తుల్లో 150 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేయాలి. అందులో భాగంగా 200 మందితో అభ్యర్థుల తుది ఎంపిక జాబితా సిద్ధం చేశారు. 200 మందితో జాబితా ఎందుకంటే.. 150 మందిలో కౌన్సెలింగ్‌కు ఎవరైనా అభ్యర్థులు రాకపోతే, ప్రాధాన్యత ప్రకారం మిగతా వారికి ఆ స్థానంలో ఉద్యోగ అవకాశం కల్పించడానికి ముందస్తుగా ఎక్కువ మందితో జాబితా సిద్ధం చేయడం జరుగుతుంది. ఆ ప్రకారం అర్హులైన 200 మందితో తుది జాబితా తయారు చేశారు. ఇక ఆ జాబితాను ప్రకటించి నియామక కౌన్సెలింగ్‌ను చేపట్టడమే. అయితే ఆ శాఖ అధికారులకు అనుమానం రావడంతో ఎందుకైనా మంచిదని, ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను ధ్రువీకరణ కోసం బోర్డుకు పంపారు. అందులో భాగంగా 100 మంది బీఎస్సీ నర్సింగ్, మరో 100 మంది జీఎన్ఎమ్ నర్సింగ్ విద్యార్హత కలిగిన అభ్యర్థుల సర్టిఫికెట్స్‌ను.. పరిశీలన కోసం పారామెడికల్ బోర్డు, డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి పంపారు. బీఎస్సీ నర్సింగ్‌కు సంబంధించి 100 మంది అభ్యర్థుల సర్టిఫికెట్స్ డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి పంపగా, అందులో 20 మంది సర్టిఫికెట్స్ బోగస్‌గా నిర్ధారించారు. జీఎన్ఎం నర్సింగ్ కోర్సు చేసిన 100 మంది అభ్యర్థుల సర్టిఫికెట్స్‌ను పారా మెడికల్ బోర్డుకు పంపగా, అక్కడి అధికారుల నుంచి సమాధానం రావాల్సి ఉంది. అందులో కూడా పెద్ద సంఖ్యలోనే నకిలీ సర్టిఫికెట్స్ ఉన్నట్లుగా తెలుస్తోంది.

కొందరు ఉద్యోగులు.. ముఠాగా ఏర్పడి..

గతంలో కూడా బోగస్ సర్టిఫికెట్స్ వ్యవహారం పెద్ద దుమారమే రేపింది. కొంత మంది ఉద్యోగులు ఒక ముఠాగా ఏర్పడి బోగస్ సర్టిఫికెట్స్‌ను తయారు చేస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారానికి సంబంధించి కొందరు ఫిర్యాదు కూడా చేశారు. ఈ అంశాలపై 'సాక్షి' పలు కథనాలను ప్రచురించింది. ఇప్పుడు కూడా వారే ఈ బోగస్ వ్యవహారానికి తెరలేపారనే ప్రచారం ఆ శాఖకు చెందిన ఉద్యోగుల్లో నడుస్తోంది. నిరుద్యోగుల ఆశలను ఆసరాగా తీసుకొని కొందరు మోసానికి పాల్పడుతున్నారు. అడ్డంగా దోచుకుంటున్నారు. 'అధికారం మాదే' అనే మదంతో కొంత మంది ఒక్కో పనికి లెక్కకట్టి వసూళ్లకు పాల్పడుతున్నట్లుగా ఉద్యోగులు బహిరంగంగా చర్చించుకోవడం గమనార్హం.

మార్కుల జాబితా మాయ

మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. జీఎన్ఎం కోర్స్‌కు 1800, బీఎస్సీ నర్సింగ్‌కు 2,700 మార్కులు ఉంటాయి. ఉద్యోగ నియామకాల్లో ఈ మార్కులతోపాటు సర్వీస్, అకడమిక్ వెయిటేజ్ మార్కులు ఉంటాయి. అలాగే కోవిడ్ కాలంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేపట్టిన విధుల కాలాన్ని బట్టి మార్కులు ఉంటాయి. ఈ మార్కుల మెరిట్‌తోపాటు ఇతర నిబంధనలను పరిగణనలోకి తీసుకొని అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. ఇక్కడ మార్కులకు ప్రాధాన్యత ఉంటుంది. దీంతో అభ్యర్థులు నకిలీ మార్కుల జాబితాను సమర్పించినట్లుగా సమాచారం. బీఎస్సీ నర్సింగ్ విద్యార్హతకు సంబంధించి మొత్తం 20 మంది బోగస్ సర్టిఫికెట్స్‌ను సమర్పించగా.. అందులో నలుగురు కరోనా డ్యూటీలకు సంబంధించి బోగస్ సర్టిఫికెట్స్ పొందుపరిచినట్లుగా సమాచారం. ఇలా మార్కుల జాబితా ఒక మాయలా మారింది. దీని ఫలితంగానే షెడ్యూల్ ప్రకారం ఎప్పుడో జరగాల్సిన నియామకాల కౌన్సెలింగ్ వాయిదా పడుతూ వచ్చింది.

అవును.. నిజమే..



బోగస్ సర్టిఫికెట్స్ వెలుగు చూసిన మాట వాస్తవమే. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా నియామకాలు చేపట్టక ముందే.. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్స్ పరిశీలన కోసం బోర్డుకు పంపాం. అక్కడ బోగస్ సర్టిఫికెట్స్ అని తేలాయి. ఇంకా నిర్ధారణ కావాల్సిన సర్టిఫికెట్స్ ఉన్నాయి. ఆ వివరాలు రాగానే చట్టపరమైన చర్యలు చేపడుతాం. అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరకముందే.. సర్టిఫికెట్స్ పరిశీలన చేపడితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఈ చర్యలు చేపట్టాం.
– డాక్టర్ రామగిడ్డయ్య, రీజినల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

క్లుప్తంగా

చుక్కల జింకను కాపాడిన అటవీ సిబ్బంది



చుక్కల జింక వద్ద అటవీ సిబ్బంది

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె మండలం మామిళ్లపల్లె ఫారెస్ట్ బీటు కొన్నేపల్లి గ్రామ పరిధిలో రెండేళ్ల వయస్సు గల ఒక మగ చుక్కల జింకను కుక్కలు తరుముకోవడంతో ప్రమాదవశాత్తు 100 అడుగుల లోతు గల బావిలో పడింది. బావిలో అట్టడుగున నీరు ఉండటంతో చిన్నపాటి గాయాలయ్యాయి. గ్రామస్థుల ద్వారా సమాచారం అందుకున్న వెంటనే కడప ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్ ఓబులేసు మామిళ్లపల్లి సెక్షన్ సిబ్బందితో కలిసి గ్రామస్తుల సాయంతో రెస్క్యూ ఆపరేషన్ చేసి జింకను ప్రాణాలతో కాపాడారు. జిల్లా వెటర్నరీ ఆసుపత్రిలో చికిత్స చేయించి రిజర్వ్ ఫారెస్ట్‌లో సురక్షితంగా వదిలి వేశారు.

ఆటో బోల్తా

15 మంది కూలీలకు గాయాలు



తీవ్ర గాయాలతో ఉన్నవారిని కడపకు తరలిస్తున్న సిబ్బంది

బ్రహ్మంగారిమఠం : మండలంలోని దిరసవంచ పంచాయతీ రాజుపేట దగ్గర ఆదివారం సాయంత్రం కూలీలతో వెళుతున్న ఆటో బోల్తా పడడంతో 15 మంది కూలీలకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. నందిపల్లె దగ్గర మిరప పంటలో పనుల కోసం నాగిశెట్టిపల్లె, రాజుపేట, పెద్దిరాజుపల్లెకు చెంది మహిళలు వెళ్లారు. పనులకు తీసుకెళ్లిన ఆటో టైరు పంచర్ కావడంతో రాజుపేటకు చెందిన మరో ఆటోలో కూలీలు ఎక్కి వస్తుండగా రాజుపేట సమీపంలోని కాశినాయన ఆశ్రమం సమీపంలోని మలుపులో ఆటో బోల్తా పడింది. దీంతో కూలీలకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన వారిని కడపకు తరలించారు. వీరిలో కె.సుభద్రమ్మ, కె.సరోజమ్మ, ఎం.ఇంద్రమ్మల పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఇరువర్గాలపై కేసులు నమోదు

మదనపల్లె : భూమి వివాదంలో భాగంగా గొడవ పడిన ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మండలంలోని వేంపల్లి పంచాయతీలోని సర్వే నంబర్ 221లో గల 2.5 ఎకరాల భూమి విషయమై బార్లపల్లెకు చెందిన షేక్ మస్తాన్, అతని కుటుంబ సభ్యులు, మరో ముగ్గురు కలిసి మదనపల్లె పట్టణం నక్కల దిన్నె మారెమ్మగుడి వద్ద ఉన్న నికలేష్‌తో పాటు ముగ్గురితో భూమి విషయమై ఆదివారం దాడులకు పాల్పడ్డారు. స్థానికులు సమాచారాన్ని తాలూకా పోలీసులకు తెలపడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న తాలూకా పోలీసులు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశారు.

హరి హర అభేద క్షేత్రం పుష్పగిరి



పుష్పగిరిలోని శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయ ప్రధాన గోపురం



చెన్నకేశవస్వామి మూల విరాట్



వైద్యనాథేశ్వర స్వామి మూల విరాట్

- ఈ నెల 29న చందనోత్సవం,
- 30న అక్షయ తదియ ,
- మే 1 న కల్యాణోత్సవాలు, 2 న రథోత్సవాలు,
- 4 న చక్రస్నానం, పుష్పయాగం

వల్లూరు : జిల్లాలోని ప్రఖ్యాతి గాంచిన పుణ్య క్షేత్రాలలో పుష్పగిరి ఒకటి. వల్లూరు మండలంలో వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరి చారిత్రాత్మకంగా ఎంతో ప్రసిద్ధి చెందింది. శివ స్వరూపుడైన వైద్యనాథేశ్వరునికి, విష్ణు స్వరూపుడైన చెన్న కేశవునికి నిలయమైన ఈ క్షేత్రం హరి హర క్షేత్రమై శివ కేశవుల మధ్య అభేదానికి ప్రతీకగా నిలుస్తోంది. భాస్కర క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన పుష్పగిరిలోని వైద్యనాథ స్వామి ఆలయాన్ని చోళుల కాలంలోను, చెన్నకేశవ స్వామి ఆలయాన్ని చాళుక్యుల కాలంలోనూ నిర్మించారని చరిత్రకారుల అభిప్రాయం.

శివ కేశవులకు 9 రోజులపాటు బ్రహ్మోత్సవాలు..

సాధారణంగా శైవ క్షేత్రాలలో ఐదు రోజులు , విష్ణు క్షేత్రాలలో తొమ్మిది రోజులు బ్రహ్మోత్సవాలను నిర్వహించడం పరిపాటి. కానీ పుష్పగిరిలో శివ కేశవులిద్దరికీ 9 రోజుల పాటు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ప్రతి కార్యక్రమంలోనూ సాక్షాత్తూ శ్రీరామ చంద్రునిచే పూజలందుకున్న శ్రీ కామాక్షీ వైద్యనాథ స్వామికి ముందుగా పూజలు నిర్వహించి, అనంతరం శ్రీ లక్ష్మీ చెన్నకేశవునికి పూజలు నిర్వహిస్తారు. ప్రతి రోజూ రాత్రి మొదట వైద్యనాథస్వామికి, అనంతరం శ్రీ చెన్న కేశవ స్వామికి వాహన సేవలు జరుగుతాయి. ఈ బ్రహ్మోత్సవాలలో 29 వ తేదీన జరిగే చందనోత్సవానికి, 30 న అక్షయ తదియలో భాగంగా జరిగే గరుడ వాహన సేవకు, మే 1 న జరిగే రెండు కల్యాణోత్సవాలకు, 2 న జరిగే రెండు రథోత్సవాలకు, బ్రహ్మోత్సవాల ముగింపు రోజైన 4 వ తేదీన జరిగే చక్రస్నానం, పుష్పయాగాలకు అత్యంత ప్రాధాన్యత ఉంది. భారీ సంఖ్యలో భక్తులు రాష్ట్రం నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా తరలి వస్తారు.

సింహ వాహనంపై వైద్యనాథేశ్వరుడు

వల్లూరు : పుష్పగిరి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి శ్రీ కామాక్షీ వైద్య నాథేశ్వర స్వామి సింహ వాహనంపై, శ్రీ చెన్న కేశవ స్వామి హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం శ్రీ వైద్యనాథస్వామి ఆలయంలో అర్చకులు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. శ్రీ కామాక్షీ అమ్మ వారికి, శ్రీ చక్రానికి కుంకుమార్చన చేశారు. రాత్రి మంగళ వాయిద్యాలు, దివిటీల వెలుగుల మధ్య స్వామి వారి గ్రామోత్సవాన్ని పుష్పగిరి మాడ వీధుల్లో ఘనంగా నిర్వహించారు.

■ కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, తోమాల సేవను నిర్వహించారు. శ్రీ లక్ష్మీదేవికి అర్చనలు జరిపారు. యాగశాలార్చన, చతుస్థానార్చన, నిత్య హోమము, బలిహరణ కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం సాయంత్రం వివిధ హోమాలను నిర్వహించారు. రాత్రి హంస వాహనం అధిష్ఠించిన చెన్న కేశవ స్వామి వారిని కొండపై నుండి పెన్నా నది మీదుగా దివిటీల వెలుగులో గ్రామంలోకి తీసుకుని వచ్చి పుష్పగిరి గ్రామ మాడ వీధులలో మంగళ వాయిద్యాలతో గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు కాయ, కర్పూరాలను భక్తితో సమర్పించారు.



సింహ వాహనంపై శ్రీ కామాక్షీ వైద్యనాథస్వామి గ్రామోత్సవం



హంస వాహనంపై శ్రీ చెన్న కేశవ స్వామి గ్రామోత్సవం

దూసుకొచ్చిన మృత్యువు

- టైరు పగిలి అదుపు తప్పి బైకును ఢీకొన్న బొలేరో వాహనం
- మోడల్ స్కూల్ ఐటీ ట్రైనర్ దుర్మరణం

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని గువ్వలచెరువు ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో బైకుపై వెళ్తున్న వ్యక్తి దుర్మరణం చెందాడు. వివరాలు ఇలా.. కడప- చిత్తూరు జాతీయ రహదారిపై రెండవ మలుపు వద్ద ఆదివారం మధ్యాహ్నం టైరు పేలిపోవడంతో టమాటా లోడుతో రాయచోటి నుంచి కడప వైపు వస్తున్న బోలెరో పికప్ వాహనం (ఏపీ39 యూపీ 9477) అదుపు తప్పింది. దీంతో పక్కనే రహదారిపై వెళ్తున్న బజాజ్ సీటీ 100 బైక్ ఏపీ 39 బీఎల్ 8837ను ఢీకొని పల్టీ కొట్టడంతో బైక్ నడుపుతున్న ఓంకారేశ్వర రావు(30) బోలెరో పికప్ కింద పడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. బోలెరో వాహన డ్రైవర్ ప్రమాద స్థలం నుంచి పారిపోయాడు. చనిపోయిన వ్యక్తి రామాపురం ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఐటీ ట్రైనర్‌గా ఆదివారం మధ్యాహ్నం వరకు ఉద్యోగ విధులు నిర్వహించాడు. అనంతరం కడప నగరం అక్కాయపల్లిలోని ఇంటికి వస్తూ ప్రమాదానికి గురయ్యాడు. మృతునికి భార్య, సంవత్సరంలోపు వయస్సు గల కుమారుడు ఉన్నారు. ప్రమాదస్థలికి వచ్చిన మృతుని కుటుంబ సభ్యులను చూసి అక్కడి ప్రజలు తీవ్ర ఆవేదన చెందారు. ప్రమాద స్థలానికి చేరుకున్న చింతకొమ్మదిన్నె పోలీసులు మృతుని కుటుంబీకులను రప్పించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ మార్చురీకి తరలించారు.



బోల్తాపడిన బొలేరో పికప్ వాహనం, మృతి చెందిన ఓంకారేశ్వరరావు

వడదెబ్బతో వృద్ధుడి మృతి

రాజంపేట : పట్టణంలోని ఆంధ్రాబ్యాంకు సమీపంలో మన్నూరు అరుంధతీవాడకు చెందిన ఎం.రమణయ్య(68) ఆదివారం వడ దెబ్బతో మృతి చెందారు. భవన నిర్మాణ కార్మికునిగా పనిచేసేవాడు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆదర్శ పాఠశాలలో సీసీ కెమెరాల చోరీ

కలకడ : మండలంలోని గుర్రంకొండ రోడ్డు మార్గం పక్కన ఉన్న కలకడ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను దుండగులు చోరీ చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మల్లంగ్‌షావలీ తెలిపారు. వాచ్‌మెన్ రామాంజులు రాత్రి భోజనానికి ఇంటికి వెళ్లిన సమయంలో గుర్తు తెలియని దుండగులు 2 సీసీ కెమెరాలను చోరీ చేశారన్నారు.

నీరు విడుదల చేసిన మంత్రి

చిన్నమండెం : రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆయన సతీమణి హరితతో కలిసి చిన్నమండెం మండలం బోనమల నాగూరువాండ్లపల్లె, బోనమల దళితవాడకు మోటార్ల ద్వారా నీటిని విడుదల చేశారు. బోనమల గ్రామ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని మంత్రి తెలిపారు.

ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మండలంలోని వలసపల్లె పంచాయతీ బొగ్గిటివారిపల్లెకు చెందిన రాజశేఖర్ భార్య సుమతి (28) కుటుంబ సమస్యల కారణంగా పురుగుల మందు తాగింది. అదే విధంగా తట్టివారిపల్లెకు చెందిన భార్గవి(39) భర్తతో గొడవపడి మనస్థాపం చెంది పురుగుల మందు తాగింది. ఆయా సంఘటనల్లో కుటుంబ సభ్యులు బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

తల్లీకూతుళ్లపై దాడి

మదనపల్లె : తల్లీకూతుళ్లపై పక్కింటి వారు దాడి చేసిన సంఘటన ఆదివారం మదనపల్లెలో జరిగింది. నెమలినగర్ వడ్డిపల్లెకు చెందిన సునీత (38) ఆమె కుమార్తె శ్రీవాణి(18) ఇంటిలో ఉండగా పక్కంటికి చెందినవారు సునిత ఇంటిలోకి తొంగి చూస్తుండగా శ్రీవాణి ప్రశ్నించింది. దీంతో మాటా మాటా పెరిగి ఆమెపై పక్కింటికి చెందిన ముగ్గురు దాడి చేశారు. ఇంతలో విషయం గమనించి సునీత బయటకు వచ్చి ఎందుకు తమ కుమార్తెను కొట్టారంటూ ప్రశ్నించడంతో ఆమెపై దాడికి పాల్పడ్డారు. స్థానికుల సహాయంతో బాధితులు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని చికిత్స అనంతరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వైఎస్ షర్మిలపై దేశద్రోహం కేసు నమోదు చేయాలి

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని బీజేపీ నాయకులు ఆదివారం మదనపల్లె వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విజయవాడలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వైఎస్.షర్మిల మాట్లాడుతూ దేశంలో ఇంటర్నల్ టెర్రరిజాన్ని బీజేపీ, ప్రధాని నరేంద్రమోదీ ప్రోత్సహిస్తున్నారని, మోదీ టెర్రరిస్ట్ అంటూ మాట్లాడారన్నారు. ఈ వ్యాఖ్యలు పాకిస్తాన్ ఉగ్రవాదానికి ఊతం ఇచ్చే విధంగా ఉన్నాయని, ఆమెపై దేశద్రోహం చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదుచేసిన వారిలో బీజేపీ నాయకులు బండి ఆనంద్, భగవాన్, జర్మనీ రాజు, కిరణ్ కుమార్, నాగరాజు, వెంకటరాజు, సాయిప్రసాద్, శ్రీకాంత్, పిల్లస్వామి నాయక్ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ విజేత అన్నమయ్య జట్టు




ప్రథమ స్థానంలో నిలిచిన అన్నమయ్య జిల్లా బాల, బాలికల జట్టుతో ఎమ్మెల్యే, కోచ్‌లు

మదనపల్లె సిటీ : స్థానిక నిమ్మనపల్లె రోడ్డులోని వశిష్ట పాఠశాలలో ఆదివారం జరిగిన 8వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల,బాలికల షూటింగ్‌బాల్ పోటీల్లో అన్నమయ్య జిల్లా బాల,బాలికల జట్టు మొదటి స్థానంలో నిలిచింది. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. గెలుపు, ఓటములు సహజమని ఓడినా, గెలిచినా సమానంగా తీసుకోవాలన్నారు. తమిళనాడులో జరగబోయే జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు అన్ని జిల్లాల నుంచి ప్రతిభ కలిగిన క్రీడాకారులను ఎంపిక చేసి శిక్షణ ఇస్తామన్నామని రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశురాముడు తెలిపారు. పోటీల నిర్వాహకులు నరేష్‌బాబు, గోల్డెన్‌వ్యాలీ రమణారెడ్డి, అనిల్ కుమార్‌రెడ్డి, పీడీలు గురు, బాలాజీ, గురుభాస్కర్, అంజనప్ప, భారతి తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

బాలికల విభాగంలో ప్రథమ స్థానం అన్నమయ్య జిల్లా, ద్వితీయ స్థానం చిత్తూరు జిల్లా, తృతీయ స్థానం తిరుపతి జిల్లా, నాలుగో స్థానంలో కర్నూలు జిల్లా జట్టు నిలిచాయి. బాలుర విభాగంలో ప్రథమ స్థానం అన్నమయ్య జిల్లా, ద్వితీయ స్థానం ఏలూరు జిల్లా, తృతీయస్థానం చిత్తూరు జిల్లా, నాలుగో స్థానం సత్యసాయి జిల్లా జట్లు సాధించాయి.

అడవికి నిప్పు పెట్టిన ఆకతాయిలు



సిద్దవటం బీటులో చెట్ల కొమ్మలతో మంటలను ఆర్పుతున్న అటవీ సిబ్బంది

సిద్దవటం : సిద్దవటం రేంజి పరిధిలోని మద్దూరు, సిద్దవటం బీట్‌లలో ఆకతాయిలు శనివారం సాయంత్రం అడవికి నిప్పు పెట్టారు. అటవీ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారని రేంజర్ కళావతి తెలిపారు. సిద్దవటంలోని అటవీ శాఖ కార్యాలయంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ ఫారెస్టు రేంజి పరిధిలోని మద్దూరు, సిద్దవటం బీట్లలో ఆకతాయిలు కొండకు నిప్పు పెట్టడంతో మంటలు ఎగిసి పడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. అటవీ సిబ్బంది అప్రమత్తమై మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారని తెలిపారు. అటవీ ప్రాంతం పచ్చదనంతో ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ ఓబులేసు, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సురేష్‌బాబు, ఎఫ్‌బీఓలు పెంచలరెడ్డి, దీపిక, మధు, ఆది విశ్వనాథ్, ఏబీఓలు హైమావతి, నారాయణరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

కళలకు నిలయం వైఎస్సార్ కడప జిల్లా

మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



కళా పోషకుడు పాకా సురేష్‌ను సత్కరిస్తున్న అంజద్‌బాషా

కడప కల్చరల్ : వైఎస్సార్ కడప జిల్లా కళలకు నిలయమని రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్ బాషా అన్నారు. శ్రీ నవ్యకళానికేతన్ 50వ వార్షికోత్సవాన్ని ఆదివారం కడప నగరంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో నిర్వహించారు. దివంగత వైఎస్ సిలార్ కుమారుడు, సంస్థ ప్రస్తుత అధ్యక్షుడు వైఎస్ సాయిబాబా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ డిప్యూటీ సీఎం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచాన్ని తనదైన నాటకాలతో ముగ్ధుల్ని చేసిన సురభి నాటక సంస్థతోపాటు బీఎన్ రెడ్డి లాంటి మహా దర్శకులు, మరెందరో సినీ నటులకు జిల్లా జన్మనిచ్చిందని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సీనియర్ రంగస్థల కళాకారుడు, హోం గార్డు మాజీ కంపెనీ కమాండర్ వైఎస్ సిలార్, నవ్యకళానికేతన్‌ను స్థాపించి సంస్థ ద్వారా సంచలనాలు సృష్టించి ఎందరో కళాకారులను తయారు చేశారన్నారు. సినీ హాస్యనటుడు గౌతంరాజు ఈ సందర్భంగా ఉదయం నుంచి యువ ఔత్సాహిక కళాకారులకు ఆడిషన్స్ నిర్వహించారు. ప్రతిభ గల వారిని ఎంపిక చేసుకుని వారికి వెబ్ సీరిస్‌లో అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షఫీ, పాకా సురేష్, సినీ యువ నటుడు కల్కి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కళాకారులు పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని ప్రేరేపిస్తున్న బీజేపీ



మాట్లాడుతున్న కే.ప్రభాకర్ రెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : దేశంలో గత పదేళ్లుగా బీజేపీ హిందుత్వ మత ఉన్మాదాన్ని ప్రేరేపిస్తోందని, కుల వివక్ష, ముస్లింలు, దళితులపై దాడులు పెరిగాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం కడప నగరంలోని రామకృష్ణ నగర్‌లో సీపీఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిలో 26 మంది చనిపోయారని, ఉగ్రవాదులను అడ్డుకున్న ముస్లిం యువకుల్ని గ్రవాదులు కాల్చి చంపారని చెప్పారు. వాస్తవాలు ఇలా ఉండగా, దేశవ్యాప్తంగా మోడీ ప్రభుత్వ ప్రచార బీజేపీ సంఘ్ పరివార్ శక్తులు ముస్లింలపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. దీన్ని ముస్లిమేతర సమాజం వ్యతిరేకించాలన్నారు. ఈ మారణ హోమానికి కేంద్ర ప్రభుత్వం భద్రతా వైఫల్యం కారణమన్నారు. మోడీ, అమిత్ షాలే దీనికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనది ఎన్డీఏ ప్రభుత్వం అని తరచూ చెబుతున్నారని కానీ కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తీసుకుని వచ్చిన సందర్భాలు లేవన్నారు. ఉండి నియోజకవర్గం అల్లూరి సీతారామరాజు నగర్ ప్రాంతంలో ఇళ్లు కోల్పోయిన నిరుపేదలకు మద్దతు ఇచ్చిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు పట్ల అనుచితంగా మాట్లాడిన డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణమరాజును బర్తరఫ్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మనోహర్, ఏ.రామ్మోహన్, వి.అన్వేష్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కే.శ్రీనివాసుల రెడ్డి, పి.దస్తగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జలాశయంలో ఈతకు వెళ్లి వ్యక్తి దుర్మరణం



ఇబ్రహీం మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

మైలవరం : వేముల మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన షేక్ ఇబ్రహీం (53) అనే వ్యక్తి మైలవరం జలాశయంలో ఈతకు వెళ్లి ఆదివారం సాయంత్రం దుర్మరణం చెందాడు. మైలవరం పోలీసులు ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. వేములకు చెందిన షేక్ ఇబ్రహీం జమ్మలమడుగు పట్టణంలో జరిగే హజరత్ సయ్యద్ షా గూడుమస్తాన్ వలీ ఉరుసు ఉత్సవానికి వేముల నుంచి శనివారం గూడెంచెరువు గ్రామంలో ఉన్న బంధువుల ఇంటికి వచ్చాడు. ఆదివారం మైలవరం మండలంలోని గైబుసా స్వామి కొండకు వెళ్లి అక్కడ చదివింపులు చేసుకుని మధ్యాహ్నం సమయంలో కుటుంబ సభ్యులతో కలసి మైలవరం జలాశయానికి వచ్చాడు. జలాశయంలో ఈతకు వెళ్లి అక్కడి మట్టిలో కూరుకుపోయాడు. ఎంత సేపటికి బయటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు మైలవరం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ శ్యాంసుందర్‌రెడ్డి, సిబ్బందితో కలసి జాలర్లను రప్పించి మృతదేహన్ని బయటకు తీశారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

కేజీ పీజీసెట్-2కే25కు విశేష స్పందన



సమావేశంలో మాట్లాడుతున్న కేఎస్‌ఆర్‌ఎం డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : కందుల గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ వారి ఆధ్వర్యంలో డిగ్రీ ఉత్తీర్ణులై పోస్ట్ గ్రాడ్యుయేట్ చేయాలనే ఆశావహులకు నిర్వహించిన కేజీ పీజీసెట్-2కే25కు విశేష స్పందన లభించిందని కే.ఎస్.ఆర్.ఎం కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగమణి తెలిపారు. ఈ పరీక్షకు ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలో టాప్ ర్యాంక్ సాధించిన విద్యార్థులకు ఉచిత అడ్మిషన్ కల్పిస్తామన్నారు. ఈ పరీక్ష రాయడం వల్ల విద్యార్థులకు రాబోయే ఐ సెట్-2025 పరీక్షపై మంచి అవగాహనతో పాటు, అనుభవం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని) మాట్లాడుతూ అధ్యాపకుల మార్గదర్శకాలను, సలహాలను తీసుకుని విద్యార్థులు ఉన్నత రంగాలలో స్థిరపడాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కందుల రాజేశ్వరి, కేఎల్‌ఎం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రత్నమ్మ , కేఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎన్ ప్రసాద్, సీనియర్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నాగరాజు, కార్య నిర్వాహక సిబ్బంది, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

బరువెక్కిన గుండెతో అంత్యక్రియలు



మృతదేహాల వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

ములకలచెరువు : చెరువులో మునిగి మృతి చెందిన ముగ్గురి అంత్యక్రియలు ఆదివారం ములకలచెరువులో బరువెక్కిన హృదయాలతో జరిగాయి. ఇద్దరు చిన్నారులకు తోడుగా వచ్చి మృతి చెందిన మరో చిన్నారి నందిత అంత్యక్రియలు కర్నాటక రాష్ట్రం కైవరమ్ క్రాస్‌లో జరిగాయి. నీళ్లలోకి దిగి నలుగురు మృత్యువాత పడిన విషయం విదితమే. ములకలచెరువులో జరిగిన ముగ్గురి అంత్యక్రియలకు తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి హాజరయ్యారు. మృతులకు నివాళులు అర్పించారు. నలుగురికి రూ. 1.75 లక్షల ఆర్థిక సహాయం అందించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు కూడా హాజరయ్యారు. ప్రతి ఒక్కరూ కంటతడిపెట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాధవ రెడ్డి, నాయకులు అన్సర్‌బాషా, సిద్దారెడ్డి, చాంద్‌బాషా, రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెండా దిమ్మె ఏర్పాటుపై కార్మిక సంఘాల గొడవ



రెండు యూనియన్ల నాయకులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్న దృశ్యం

మదనపల్లె : మేడే సందర్భంగా జెండా ఎగుర వేసేందుకు దిమ్మె ఏర్పాటు విషయం రెండు యూనియన్ల మధ్య వివాదానికి కారణమైంది. మున్సిపాలిటీలో ఇతర యూనియన్ల జెండా దిమ్మె ఏర్పాటును అంగీకరించేది లేదంటూ ఏఐటీయూసీ నాయకులు అడ్డుకుంటే, ఎలాగైనా జెండా దిమ్మె ఏర్పాటుచేసి తీరుతామంటూ సీఐటీయూ నాయకులు పంతానికి దిగారు. చివరకు రెండు యూనియన్ల మధ్య జెండా దిమ్మె ఏర్పాటుపై మొదలైన వివాదం చిలికి, చిలికి గాలివానగా మారి ఒక వర్గంపై మరొకరు దాడులు చేసుకుని పోలీసు కేసులు పెట్టుకునేంత ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఎట్టకేలకు పోలీసులు జోక్యం చేసుకుని ఆదివారం మున్సిపల్ కమిషనర్ అందుబాటులో లేరని, సోమవారం కమిషనర్ సూచనలతో ఏర్పాటు చేసుకోవాలని సర్దిచెప్పడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. మదనపల్లె మున్సిపాలిటీలో చాలాకాలంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మాత్రమే కార్మిక సంఘం ఉండేది. కొద్దిరోజుల క్రితం ఏఐటీయూసీ నాయకుల ఆధిపత్యం భరించలేక, కార్మికుల్లో కొందరు విడిపోయి సీఐటీయూ యూనియన్‌లో చేరారు. అప్పటి నుంచి ఇరువర్గాల మధ్య చిన్న చిన్న వివాదాలు జరుగుతుండేవి. ఒక యూనియన్‌లో నుంచి మరో యూనియన్‌లో చేరాల్సిందిగా కార్మికులపై ఒత్తిడి తెచ్చేవారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం సీఐటీయూలోకి వెళ్లిన ఇద్దరు పర్మినెంట్, ఇద్దరు ఆప్కాస్ కార్మికులను ఏఐటీయూసీలోకి చేర్చుకున్నారు. ఇదిలాఉంటే.. మే1 అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా.. మున్సిపల్ కార్యాలయ ప్రహరీకి ఆనుకుని జెండా దిమ్మె ఏర్పాటు చేసుకునేందుకు సీఐటీయూ నాయకులు సామగ్రి తరలించారు. విషయం తెలుసుకున్న ఏఐటీయూసీ నాయకులు నాగరాజు, సురేష్, ముబారక్, సాంబశివ, పృథ్వీరాజ్, అశోక్, ఓబులేసు తదితరులు అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ వాతావరణం ఏర్పడింది. సీఐటీయూ అనుబంధసంఘం కోశాధికారి రామకృష్ణ, ఏఐటీయూసీ నాయకులు ఓబులేసు ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు.